ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

శనివారం 22 ఫిబ్రవరి 2025 | 5

ఉల్లాసంగా.. 6

జిల్లా క్రీడా మైదానంలో క్యాంప్ ఫైర్.. నృత్యాలు





ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా క్రీడాకారుల క్యాంప్ ఫైర్ సందడి

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

- కాకినాడ జిల్లాలో 98 పోలింగ్ కేంద్రాలు
- 70,540 మంది పట్టభద్రుల ఓటర్లు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధంచేస్తున్నారు. జిల్లాలో మొత్తం 98 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీనిలో కాకినాడ డివిజన్‌లో 67 కేంద్రాలు, పెద్దాపురం డివిజన్‌లో 31 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ పరిణామాలను కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసే మెయిన్ సర్వర్ ద్వారా ఉన్నతాధికారులు వీక్షిస్తారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో 115 మంది పీవోలు, 115 మంది ఏపీవోలు, 250 మంది ఓపీవోలు, 115 మంది మైక్రో అబ్జర్వర్లు పాల్గొంటున్నారు. ఇప్పటికే వీరికి ఎన్నికల విధులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలింగ్ ఈనెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు భారీగా బలగాలను మోహరిస్తున్నారు.

పది గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి

ఓటు వేసే ఓటర్లు పది గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక కార్డు తీసుకెళ్లాలి. ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్, ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపుకార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపుకార్డులు, విద్యా సంస్థలు జారీ చేసే గుర్తింపు కార్డులు, డిగ్రీ సర్టిఫికెట్లు, దివ్యాంగుల గుర్తింపుకార్డు, యూనిక్ డిజెబిలిటీ ఐడీ కార్డు.. ఇలా ఏదొక కార్డు తీసుకెళ్ల వచ్చు.

జిల్లాలో 70,540 మంది ఓటర్లు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలో 70540 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. దీనిలో కాకినాడ డివిజన్‌లో 50,573 మంది,పెద్దాపురం డివిజన్‌లో 19967 మంది ఉన్నారు. ఈనెల 27వ తేదీన పోలింగ్ జరుగుతుంది. మార్చి 3వ తేదీన ఏలూరులో కౌంటింగ్ జరిపి ఫలితాలు వెల్లడిస్తారు.

- ఏఆర్వో, డీఆర్వో వెంకట్రావు

చోరీ.. రికవ్రీ!



జిల్లాలో రానురాను దొంగతనాలు కలవరపెడుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దొంగలు రెచ్చి పోతున్నారు. డబ్బు, నగదు కొట్టేస్తూ పేట్రేగిపోతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. అయితే చోరీ కేసుల్లో బాధితులు తాము కోల్పోయిన డబ్బు, నగదు ఎంతోకొంత తిరిగి తెస్తారనే ఆశతో స్టేషన్‌కు వెళ్ల కేసులు పెడుతున్నారు. తీరా చోరీ సొత్తు రికవరీలో మాత్రం పోలీసులు పనితీరు కనబర్చడంలో విఫలమవుతున్నారు. అనేక కేసుల్లో దర్యాప్తును నీరు గార్చేస్తున్నారు. రోజువారీ పని ఒత్తిళ్లు, ఇతర బందోబస్తు విధులతో దొంగతనం కేసులను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో బాధితులు పోలీసులపై నమ్మకం కోల్పోతున్నారు. దొంగలు పట్టుకుపోయిన తమ నగదు, బంగారం తిరిగి తెస్తారనే ఆశలు వదిలేసుకుంటున్నారు. అటు బాధితులు సైతం చోరీ జరిగిన తర్వాత ఓ వారంపాటు స్టేషన్ చుట్టూ తిరిగి ఆనక పోలీసుల తీరుతో విసుగెత్తి కేసు కొలిక్కి రాదని స్టేషన్ మెట్లు ఎక్కడం మానేస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే దర్యాప్తు ముందుకు సాగడం లేదని తెలుసుకుని తమకు న్యాయం జరగదని ఆశలు వదిలేసుకుంటున్నారు. దీనికి నిదర్శనమే జిల్లాలో చోరీ కేసుల్లో పోలీసుల నాసిరకం రికవరీ తీరు. గతేడాది జిల్లాలో మొత్తం 710 దొంగతనాల్లో బాధితులు రూ.7.79 కోట్లు పొగొట్టుకోగా, రికవరీ కేవలం రూ.3.58కోట్లే అయింది. అంతకు ముందు 2023లో రూ.5.30కోట్లకు రూ.2.50కోట్లు కూడా అవలేదు. అటు దొంగతనాలు సైతం 2022లో జిల్లాలో 106 జరిగితే, 2023లో 686, 2024లో ఏకంగా 710 నమోదయ్యాయి.

- జిల్లాలో ఏయేటికాయేడు పెరిగిపోతున్న దొంగతనాలు
- అయినా చోరీ సొత్తు రికవరీలో దిగదుడుపుగా పోలీసుశాఖ పనితీరు
- గతేడాది జిల్లాలో 710 దొంగతనాల కేసుల్లో బాధితులు పోగొట్టుకున్నది రూ.7.79 కోట్లు
- ఇందులో దొంగల నుంచి పోలీసులు రికవరీ చేసింది కేవలం రూ.3.58 కోట్లే
- గడిచిన నాలుగేళ్లుగా రికవరీలో బాగా వెనుకబడిపోతున్న పోలీసులు
- 2023లో రూ.6.10 కోట్లకు సగమే రికవరీ.. 2020, 2021, 2022ల్లో మరీ ఘోరం
- అనేక చోరీ ఘటనల్లో వారం తర్వాత అసలు దర్యాప్తు ఊసే ఎత్తని పోలీసులు
- ఇతర కేసుల ఒత్తిడి, బందోబస్తు డ్యూటీలతో నేర దర్యాప్తులో పురోగతి శూన్యం
- అటు దొంగలపాలైన నగదు, బంగారం రికవరీపై బాధితుల్లో సడలుతున్న నమ్మకం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏదైనా ఇంట్లోనో, దుకాణంలోనో చోరీ జరిగితే పోలీసులు గతంలో లోతైన దర్యాప్తు చేసేవారు. సంఘటన జరిగిన ప్రదేశంలో వేలిముద్రల సేకరణ, డాగ్‌స్క్వాడ్, పాతనేరస్తుల రికార్డుల తిరగవేత, ఆనుపానుల కదలికలు.. ఇలా ఒకటేంటి అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేసి నిందితులను వారాల వ్యవధిలోనే పట్టుకునేవారు. అటు బాధితులు పొగొట్టుకున్న నగదు, బంగారం సైతం దాదాపు రికవరీ చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కడైనా చోరీ జరిగితే పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదు. బాధితులు పదేపదే న్యాయం కోసం తిరుగుతున్నా న్యాయం చేయడంలో విఫలమవుతున్నారు. అంతేకాదు చోరీపై కేసు పెట్టినా దర్యాప్తుతపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా దొంగతనాల కేసుల్లో బాధితులు పొగొట్టుకున్న ఆస్తి తిరిగి రావడం లేదు. దీంతో బాధితులు చోరీ ఘటనల్లో పోలీసులు తమకు న్యాయం చేస్తారన్న ఆశలు వదిలేసుకుంటున్నారు. తమ సొత్తు రికవరీ అవదనే ఆవేదనతో నిస్సహాయంగా మారుతున్నారు. ప్రధానంగా జిల్లాలో గతేడాది మొత్తం మీద 710 దొంగతనాలు జరిగాయి. ఇందులో పగలు, రాత్రి ఇంటిదొంగతనాలు 141కాగా, ఇతర చోరీలు 561 జరిగాయి. వీటన్నింటిలో బాధితులు కోల్పోయన డబ్బు, బంగారం విలువ రూ.7.79 కోట్లు. తీరా ఏడాది మొత్తంలో ఈ చోరీ సొత్తులో పోలీసులు రికవరీ చేయగలిగింది కేవలం రూ.3.58 కోట్లు మాత్రమే. అంటే రికవరీ 46 శాతం మాత్రమే. అంటే రికవరీలో పోలీసుల పనితీరు ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా కాకినాడ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 15పోలీసు స్టేషన్ల పరిధిలో గతేడాది మొత్తం 383 చోరీలు జరగ్గా రూ.3.68 కోట్ల సొత్తు దొంగలపాలైంది. మొత్తం దొంగతనాల్లో పోలీసులు కేవలం 174 కేసులే ఛేదించగలిగారు. మరో 183 చోరీ కేసులను అసలు పట్టుకోలేకపోయారు. దీంతో రికవరీ రూ.1.81 కోట్లే చూపించారు. మొత్తం 15స్టేషన్లలో అత్యధికంగా కాకినాడ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ స్టేషన్ల పరిధిలో గతేడాది 143 చోరీలు జరిగాయి. అటు పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో 13 పోలీసు స్టేషన్లు ఉండగా, గతేడాది వీటి పరిధిలో 354 చోరీలు జరిగాయి. అత్యధికంగా సామర్లకోట పోలీసు స్టేషన్ పరిధిలో 73 చోరీలు జరిగాయి. అయితే ఈ డివిజన్‌లో మొత్తం చోరీల్లో రూ.4.10కోట్ల సొత్తు దొంగలపాలవగా, ఇందులో ఏడాది మొత్తం మీద రికవరీ రూ.1.76కోట్లే అయింది. అయితే మొత్తం చోరీల్లో 139 చోరీలను ఛేధించగా, 196 కేసులను ఇప్పటికీ పట్టుకోలేకపోయారు. దీంతో బాధితుల్లో తమకు



ఏలేశ్వరంలో గోల్డ్‌షాపునకు కన్నం (ఫైల్‌ఫొటో)

న్యాయం జరుగుతుందనే నమ్మకం పోయింది.

ఎప్పటికప్పుడు సమీక్షే లేదు..

జిల్లాలో గతకొన్నేళ్లుగా చోరీలు క్రమేపీ పెరిగిపోతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి దొంగల ముఠాలు జిల్లాలో పాగావేస్తున్నాయి. అయినా పసిగట్టడంలో పోలీసులు చాలావరకు విఫలమవుతున్నారు. కనీసం నిఘా కూడా లేకపోవడంతో చోరీలతో దొంగలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా కేసుల వివరాలను పరిశీలిస్తే 2020లో జిల్లాలో మొత్తం 105 చోరీలు జరగ్గా, 2021లో 111, 2022లో 106, 2023 686 చోరీలు జరిగాయి. గతేడాదికి వచ్చేసరికి కేసులు 710 నమోదయ్యాయి. అటు బాధితులు పోగొట్టుకున్న చోరీ సొత్తు కూడా అమాంతం పెరుగుతోంది. కానీ పోలీసులు మాత్రం వీటి రికవరీని పెద్దగా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా 2020లో జిల్లాలో పోలీసు రికార్డుల ప్రకారం 105 దొంగతనాలు జరగ్గా, రూ.4.22 కోట్ల సొత్తు చోరీకి గురైంది. ఇందులో 46 శాతమే రికవరీ అయింది. 2021లో 111 చోరీల్లో నగదు, బంగారం కలిపి రూ.5.06కోట్లు పోయినట్టు పోలీసులు తేల్చారు. ఇందులో సగం మందికి న్యాయం జరగలేదు. 2022లో 5.30 కోట్లు, 2023లో రూ.6.10కోట్లు జనం పోగొట్టుకున్నారు. ఇందులోను రికవరీ శాతం దిగదుడుపే. వాస్తవానికి చోరీ ఘటనల్లో పోయిన మొత్తం సొత్తులో రికవరీ శాతం తొంభై శాతం వరకు ఉంటే పోలీసుల పనితీరు బాగున్నట్టు. అనేక జిల్లాల్లో పోలీసులు మంచి రికవరీ చూపిస్తున్నారు. ఎప్పటికప్పుడు కేసులు సమీక్షించుకుంటూ దర్యాప్తులో ఫలితాలు చూపిస్తున్నారు. కానీ జిల్లాలో రికవరీ శాతం ఎప్పుడూ సగంలోపే ఉంటుంది. దీంతో పోలీసుల నుంచి తమకు న్యాయం జరుగుతుందని బాధితులు ఆశలు వదిలేసుకుంటున్నారు. వాస్తవానికి చోరీ కేసుల్లో దొంగలను పట్టుకుపోయిన సొత్తును రికవరీ చేయడంలో ఒకప్పుడు జిల్లా పోలీసులకు మంచి పేరుండేది. అది రానురాను తగ్గిపోయింది. ప్రస్తుతం ఏ స్టేషన్‌లో చూసినా కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు విపరీతమైన పని ఒత్తిడి. ఒక కేసుపై దృష్టిసారించేలోపు మరో కేసు వచ్చి పడుతోంది. భూతగాదాలు, హత్యలు, అట్రాసిటీ కేసులు, అత్యాచారాలు, గంజాయి కేసులు ఇలా ఒకటేంటి రోజూకో కొత్త కేసు నమోదవుతోంది. దీంతో ఏ కేసుపైనా ఎక్కువ రోజులు దృష్టి సారించే వీలుండడం లేదు. దీంతో చోరీ కేసులను పోలీసులు పట్టించుకోలేని పరిస్థితి నెలకొంది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న షాన్‌మోహన్, పక్కన ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ

ఉద్యోగ విరమణ పొందిన మొదటి నెలలోనే పెన్షన్..

జీపీఎఫ్ అదాలత్ లక్ష్యం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగ విరమణ పొందిన మొదటి నెలలోనే పెన్షన్ పొందడం జీపీఎఫ్ అదాలత్ లక్ష్యమని కలెక్టర్ షాన్‌మోహన్, రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ పేర్కొన్నారు. పెన్షన్ అదాలత్, జీపీఎఫ్ అదాలత్ ఫలవంతమైన దిశగా నిర్వహించుకోవడం శుభపరిణామమని, జిల్లాలోని పెన్షన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పెన్షన్ అదాలత్, జీపీఎఫ్ అదాలత్, ఇతర అనుబంధ సమస్యల పరిష్కారం కోసం ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ షాన్ మోహన్, అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన సర్వీసుకు సంబంధించిన అన్ని అంశాలు సర్వీసు రిజిస్టర్‌లో నమోదు అయ్యేవిధంగా చూడాలన్నారు. అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ మాట్లాడుతూ వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పెన్షన్ ప్రతిపాదనలు ఉద్యోగవిరమణ తేదీకి ఆరు నెలల ముందే సంబంధిత జిల్లా డ్రాయింగ్, పంపిణీ అధికారులకు వారి పెన్షన్ పత్రాలు సమర్పించాలన్నారు. ఈ సంద ర్భంగా పలువురికి పెన్షన్ మంజూరు పత్రాలను అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ ఎన్.మోహనరావు, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ పి.కిషోర్‌రెడ్డి, వి.లలితకుమార్, అధికారులు జి.సునీత, టి.విజయ్‌కుమార్, డి.చంద్రశేఖర్, ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఇది పోలీసు 'డ్రోన్'

దీని కంట చిక్కితే కటకటాలే

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డ్రోన్‌ల వినియోగంతో పోలీస్ శాఖ సత్ఫలితాలను సాధిస్తోంది. ఎస్పీ జి.బిందుమాధవ్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల శివార్లలో నేరాలు నియంత్రించేందుకు రాత్రి పెట్రోలింగ్, రాత్రి బీట్స్‌కు డ్రోన్‌లను వినియోగిస్తున్నామన్నారు. జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్క్‌లను గుర్తించి ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ ద్వారా నిఘాను పటిష్టం చేస్తున్నామన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 23న నిర్వహిస్తున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్విహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులు ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్-2, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, రెవెన్యూ ఏపీపీఎస్సీ తదితర అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్ష జరుగుతుందన్నారు. 9,379 అభ్యర్థుల నిమిత్తం జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలు ఉన్న ఆయా మండలాల పరిధిలో ఎలాంటి ఆందోళనలు, అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 22వ తేదీ శనివారం సాయంత్రం నుంచి 23వ తేదీ ఆదివారం సాయంత్రం వరకు 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలుచేయాలని ఆయన ఆదేశించారు.

56 సెంటర్లలో ఇంటర్ పరీక్షలు

మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు 44,531 మంది విద్యార్థుల నిమిత్తం జిల్లాలో 56 కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష పత్రాలు జిల్లాకు వచ్చిన దగ్గర నుంచి పరీక్షా కేంద్రాలకు తరలించే దాకా అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకట్రావు, ఇంటర్మీడియట్ పరీక్షల ప్రత్యేక అధికారి అప్పలరాజు, డీఐఈవో నూకరాజు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు

గ్రూప్-2 అభ్యర్థుల ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-2 నోటిఫికేషన్‌లో రోస్టర్ పొరపాట్లను సరిదిద్దిన తర్వాతే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సమస్య హైకోర్టులో ఉన్నందున తీర్పు తర్వాతే ఈ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రోస్టర్ పొరపాట్ల వల్ల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాథమిక విద్య ఆర్జేడీ నాగమణి

శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు : ఆర్జేడీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రాథమిక విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి నాగమణి పేర్కొన్నారు. రియలన్స్ ఇండస్ట్రీస్ గాడిమొగ తమ సామాజిక బాధ్యతలో భాగంగా శుక్రవారం స్థానిక దంటు కళాక్షేత్రంలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భైరవపాలెం, గాడిమొగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 160 మంది పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్జేడీ నాగమణి మాట్లాడుతూ పరీక్షల్లో విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను వివరించారు పడాల చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ పదో తరగతి అనంతరం ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ సీఎస్ఆర్ హెడ్ పోతాప్రగడ సుబ్రహ్మణ్యం, హెచ్ఆర్ మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో ఎంపీ, సిటీ ఎమ్మెల్యే భేటీ

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో శుక్రవారం ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ భేటీ అయ్యారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కూడా కలెక్టర్‌ను కలిశారు.

అచ్చు గుద్దినట్టు..



నేడు కవలల దినోత్సవం

ఈరోజు కవలల దినోత్సవం. ఏడాదిలో ఫిబ్రవరి రెండో నెల. ఆ నెలలో 22వ తేదీన కవలల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతోంది. ప్రముఖ మెజీషియన్ చొక్కాపు వెంకట రమణ దీన్ని ట్విన్స్ డేగా ప్రకటించ డంతో అప్పటి నుంచి ఇది కవలల దినోత్సవంగా మారింది. సాధారణంగా కవలల్లో ఇద్దరూ ఆడ లేదా మగ పుడతారు. అరుదుగా ఒక ఆడ, ఒక మగ పిల్లలూ జన్మిస్తారు. ఒకే రంగు, రూపు, ఎత్తు, జుట్టు ఇలా శరీర నిర్మాణపరంగా 90 శాతం పైగా ఒకేలా ఉంటూ చూపరులను గందరగోళపరుస్తారు. కుటుంబీకులు సైతం తికమక పడేలా అచ్చుగుద్దినట్టు కొందరుంటారు. ఇలా విశేషమైన ఒకే తీరు లక్షణాలతో జన్మించిన కొందరి పరిచయం ఇలా..

దివాన్‌చెరువుకు చెందిన కవలలు మట్ట ప్రవణశ్రీ, ప్రజ్ఞశ్రీ

ఇద్దరూ.. ఒకేలా..

అచ్చం ఒకరిని పోలి ఒకరు.. రూపం ఒకటే కానీ వ్యక్తులు ఇద్దరు. దివాన్‌చెరువుకు చెందిన మట్ట దుర్గారావు, దుర్గాప్రసన్న దంపతులకు ప్రజ్ఞశ్రీ, ప్రవీణశ్రీ కవలలుగా జన్మించారు. వీరు ఇద్దరూ అచ్చం ఒకరిని పోలి ఒకరు ఉంటారు. ప్రస్తుతం తమ కుమార్తెలు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తండ్రి దుర్గారావు తెలిపారు. తమ కుమార్తెలను గుర్తించేందుకు బయటి వ్యక్తులు తికమక పడుతుంటారని ఆయన చెప్పారు. - దివాన్‌చెరువు



అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న కవలలు

అంబాజీపేట గ్రామానికి చెందిన వర్షిణి, హర్షిణి ఇద్దరు కవలలు. వీరిద్దరు అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నారు. అలాగే మాచవరం గ్రామానికి చెందిన సాయిచరణ్, భువనేశ్వరి ఇద్దరు కవలలు. వీరు కూడా ఇదే హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నారు. ఇక్కడే ఎనిమిదవ తరగతి చదువుతున్న అంబాజీపేటకు చెందిన కవలల ధరణి, దర్శినిలు ఎప్పుడూ ఒకే రకం దుస్తులతో కనిపిస్తారు. దాంతో వారిని పోల్చుకోవడం కష్టమే. ఏడో తరగతి చదువుతున్న బెరీషా, బెహర్నాలది అంబాజీపేట. - అంబాజీపేట



తికమక..మకతిక..

వీరు మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన కోట రామకుమార్, కోట రాకేష్‌లక్ష్మణ్ 1995లో జన్మించారు. వారద్దరినీ ఒకేసారిచూస్తే బంధువులు, స్నేహితులు గుర్తుపట్టలేక తికమకపడుతుంటారు.



సత్య రితిక్, సత్య రూపక్

రూపమే కాదు.. గుణాలు ఒకటే!

కవలలైన తమ పిల్లలు రూపంలోనే కాదు.. గుణగణాల్లోనూ ఒకేలా ఉంటారని కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన కొండేపూడి బుల్లిరాజు, సూర్యకుమారి దంపతులు చెప్పారు. ఒక్కోసారి తమ పిల్లలను గుర్తించే విషయంలో తాము కూడా పొరబడుతుంటామన్నారు. ప్రస్తుతం వీరు కోటిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. - కె.గంగవరం



వర్షిణి.. వర్ధిని

వీరు కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన టీడీపీ నాయకుడు గుబ్బల మూర్తి కుమార్తెలు వర్షిణి, వర్ధిని. వీరిద్దరూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. - కొత్తపేట





- కరప

ఒకే రూపు.. అదే తీరు.. భలే పేర్లు!

కరప మండలం పాతర్లగడ్డ గ్రామానికి చెందిన పులపకూర వెంకటరమణ, ఝాన్సీరాణి దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరికి ఐదేళ్ల వయసున్న ఇశితాప్రియ, ఇన్విత్రాప్రియ అనే కవల పిల్లలు ఉన్నారు. కరప గ్రామానికి చెందిన రెడ్డి వీరవెంకటసత్యనారాయణ (వీరబాబు), సూర్యకుమారి దంపతులకు 11 ఏళ్ల కింద ఒక మగ, ఒక ఆడబిడ్డ జన్మించారు. వీరికి తన తల్లిదండ్రులు వీరవెంకట సత్యనారాయణ, సూర్యకుమారి పేర్లు పెట్టుకున్నారు. తాతనానమ్మ, తల్లిదండ్రులు, మనవళ్ల పేర్లు ఒక్కటే కావడం ఇక్కడ విశేషం.

ఒకే ఊరిలో 110 మంది కవలలు

బావి నీరు కారణమంటున్న దొడ్డిగుంట వాసులు



ఇది చదివాక.. కవలల పుట్టినిల్లు అనాలేమో. రంగంపేట మండలం పెద్దదొడ్డిగుంటలో ఏకంగా 110 కవల జంటలు జన్మించారు. దీనికి కారణం తమ ఊరిలో ఉన్న బావినీరే కారణమని చెబుతారు. 150 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ బావి నీటిని తాగితే కవలలు పుడతారని ప్రతీతి. దీంతో ఈ గ్రామస్తులేకాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి కొత్తగా పెళ్లయిన జంటల నుంచి, పిల్లలు లేని దంపతుల వరకు ఈ బావి నీటిని తాగుతున్నారు. ఇరవై ఏళ్ల కిందట బండి శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడు జనాభా లెక్కలు రాసుకునేందుకు వచ్చి, గ్రామంలో ఇంతమంది కవలలు ఉన్నారేంటని ఆశ్చర్యపోయారు. ఆ బావి నీటి వల్లే కవలలు పుట్టారంటూ గ్రామస్తులు తెలిపారు. అయితే ఉపాధ్యాయుడు ఆ మాటలను నమ్మలేదు. కొంతకాలం తర్వాత ఆ ఉపాధ్యాయుడు అదే గ్రామానికి బదిలీపై వచ్చారు. అప్పటికే వారికి బాబు ఉండగా, ఆ బావి నీరు ఆ దంపతులు తాగడంతో ఇద్దరు కవల ఆడపిల్లలు పుట్టారని, అప్పటి నుంచి ఇది బాగా ప్రాచుర్యంలోకి వచ్చినట్టు దొడ్డిగుంట గ్రామస్తులు తెలిపారు. ఏదిఏమైనా ఆ గ్రామంలో అంతమంది కవలలు ఉండడం విశేషమే కదా మరి. - రంగంపేట



అరె..టేనా!



ఓను.. అందానికే..తినడానికి పనికిరాదు

అబ్బురపరుస్తున్న ఇండోనేషియా రకం

అరెటేనా..ఇంకేమైనానా..ఏంటిది..ఇంత గెల.. సాధ్యమా..అని ఆశ్చర్యపోతున్నారా..! సాధ్యమే.. ఈ అరటి గెల ఎక్కడ ఉందో చూడాలంటే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద సంఘమేశ్వరం వెళ్లే రోడ్డులో ఉన్న సాయి రాఘవేంద్రనర్సరీకి వెళ్లాల్సిందే.. ఆ నర్సరీ రైతు మార్ని సత్యనారాయణరావు ఇండోనేషియా దేశానికి చెందిన అరటిని సాగుచేస్తున్నారు.దీనిపేరు థౌజండ్ ఫింగర్స్.ఈ అరటిగెల కనిపించడానికి భారీగానే కనిపిస్తుంది కానీ తినేందుకు పనికిరాదండోయ్.. అందంగా పెంచుకోవాల్సిందే..ఆ గెలను చూస్తూ ఆనందించాల్సిందే.. ఈ చెట్టు గెలకాసేందుకు 11 నెలల సమయం పడుతుంది.గెల మొత్తం పూర్తవ్వడానికి నాలుగు నెలలు పడుతుందని ఆయన చెప్పారు.నర్సరీలో వేసిన అరటి గెల పొడవు మూడు మీటర్లు, గెల చుట్టు కొలత ఆరమీటరు ఉందని తెలిపారు. ఈ గెలను విదేశాల్లో పెళ్లిళ్లకు అందకోసం వాడతారని ఇదేగెల ఇండోనేషియాలో రూ.15వేలు వరకు ధర ఉంటుందన్నారు.నేలపై కూడా గెల వేసి అబ్బురపరుస్తున్న అందరినీ అబ్బుర పరుస్తుంది. - మండపేట

9 నుంచి నరసన్న కల్యాణోత్సవాలు

కోరుకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మినరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు వచ్చే నెల 9వ తేదీ నుంచి ఆరంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ. ప్రతి ఏడాది సుమారు లక్ష మంది వరకు భక్తులు రథోత్సవంలో పాల్గొంటారు. స్వామి వారి రథంపై అరటి పండ్లు వేయడం ఇక్కడ సంప్రదాయం. పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మి నరసింహభట్టర్, పెద్దింటి, పెరవలి, పెదపాటి అను వంశక అర్చకస్వాములు వేద మంత్రోచ్చరణల మధ్య గ్రామస్తులు స్వామి వారి అతిపెద్ద రథాన్ని రథశాల నుంచి బయటకు తీశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.ఆర్ అండ్‌బీ,పోలీసు,అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు సూచనల మేరకు రథానికి మరమ్మతులను చేపడుతున్నారు.రథాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ఆర్ అండ్‌బీ అధికారులు రథం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసిన తరువాత రథాన్ని వినియోగిస్తారు.రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ రథాన్ని పరిశీలించారు.



కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ విజయవంతంగా ముందుకు సాగుతోంది. ప్రతి మ్యాచ్ హోరాహోరీగా జరుగుతోంది. శుక్రవారం జరిగిన అన్ని మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం 8 మ్యాచ్‌లు జరిగాయి. హాకీ టోర్నమెంట్ కన్వీనర్ రాజ్‌కుమార్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

సై



హోరాహోరీగా హాకీ పోటీలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 15-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మహిళా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 22-0 తేడాతో విజయం సాధించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్టు 6-2 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ కాన్పూర్, ఆర్ఎస్బీ జైపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ కాన్పూర్ 4-2 తేడాతో గెలిచింది. ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ కొచ్చి, ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ కొచ్చి 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ హైదరాబాద్, ఆర్ఎస్బీ భువనేశ్వర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ హైదరాబాద్ 5-0 తేడాతో విజయం సాధించింది.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం



వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాం

షాన్‌మోహన్, కాకినాడ జిల్లా కలెక్టర్



హాకీ టోర్నమెంట్ నిర్వహణ అంతా సంతృప్తికరంగా సాగింది. కాకినాడ వేదికగా మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్లు జరగాలి. మొట్టమొదటి సారిగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వచ్చి పాల్గొన్నారు. పూర్తిస్థాయిలో విజయవంతమయ్యాం. మన జాతీయ క్రీడ హాకీ కోసం క్రీడాకారులను ఈ టోర్నమెంట్ ద్వారా ముందుకు తీసుకెళ్లాం. అసోసియేషన్ మెంబర్స్‌తో మరెన్నో టోర్నమెంట్లు నిర్వహించుకోవడానికి సిద్ధపడతాం.

స్థానిక యువత తిలకించేందుకు రావాలి

మల్లిబాబు, ఆర్డీవో



జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్ కాకినాడ వేదికగా జరుగుతోంది. మ్యాచ్‌లు చూడడానికి స్థానిక యువత, ప్రజలు ఆసక్తి కనబరచాలి. క్రికెట్‌కు ఉన్న క్రేజ్ హాకీకి లేకపోవడంతో తిలకించేందుకు ఎవరూ రాకపోవడం బాధాకరం. ఫైనల్ మ్యాచ్ అయినా తిలకించేందుకు స్థానిక యువత రావాలి. కలెక్టర్ షాన్‌మోహన్ ఎక్కడా రాజీపడకుండా ఏర్పాట్లు చేశారు.

స్నేహపూర్వక వాతావరణం కోసం క్యాంప్ ఫైర్

వి.రవిరాజు, టోర్నమెంట్ కోఆర్డినేటర్,



సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్ మొట్టమొదటిసారి మన కాకినాడలో జరగడం చాలా సంతోషం. కలెక్టర్ షాన్‌మోహన్ కృషితోనే ఇదంతా సాధ్యమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరం కోసమే ఈ క్యాంఫైర్ ఏర్పాట్లు. 2028లో నిర్వహించనున్న అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌కు కాకినాడ వేదిక కావాలని ఆశిస్తున్నాను. ఈ టోర్నమెంట్‌కి 15మంది టెక్నికల్ అఫీషియల్స్‌ను, 30మంది పీడీలను ఆంధ్రప్రదేశ్ నుంచి రిక్రూట్ చేసుకుని మ్యాచ్‌లు నిర్వహిస్తున్నాం.

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి)



ఉల్లాసంగా..

జిల్లా క్రీడా మైదానంలో క్యాంప్ ఫైర్.. క్రీడాకారుల నృత్యాలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన క్యాంప్ ఫైర్ ఉత్సాహంగా సాగింది. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, వివిధ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు.



ఆహా..ఏమి రుచి

క్రీడాకారులకు పసందైన విందు



కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ సందర్భంగా శుక్రవారం క్రీడాకారులకు పసందైన విందు ఏర్పాటు చేశారు. శాకాహార, మాంసాహార వంటకాలను సిద్ధం చేశారు. ప్రముఖ చెఫ్ టి.బాలాజీ సారథ్యంలో ఘుమఘుమలాడే వంటకాలు తయారు చేశారు. చిట్టిముత్యాల బిర్యానీ, రొయ్యలు ఫ్రై, రొయ్యల కర్రీ, చేప పులుసు, నెత్తళ్ల ఫ్రై, అపోలో ఫిష్ లాంటి నాన్‌వెజ్ రకాలతో పాటు పన్నీర్ బటర్ మసాలా, బంగాళదుంప మిల్‌మేకర్ కర్రీ, బూందీ ములక్కాడ జీడిపప్పు కర్రీ, పప్పు మామిడికాయ కర్రీ, బీట్‌రూట్ రసం, సాంబారు లాంటి వెజ్ కర్రీలు..చిల్లీ మంచూరియా, మష్రూమ్ జీడిపప్పు, వెజ్‌స్ప్రింగ్ రోల్స్, పీనట్ మసాలా, తందూరి రోటీ వడ్డించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులతో పాటు ఇతర అధికారులు, క్రీడాకారులు విందుకు హాజరయ్యారు.

వాహనదారులు అలెర్ట్



మోటారు వాహన చట్టంలోని నిబంధనలు పక్కాగా అమలు చేసే దిశగా పోలీసు, రవాణాశాఖలు అడుగులు వేయబోతున్నాయి. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. హెల్మెట్, సీటుబెల్ట్‌లు తప్పనిసరిగా ధరించేలా చూడాలని ప్రయత్నిస్తున్నాయి. లేదంటే భారీస్థాయిలో జరిమానాలు, శిక్షలు విధించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే
- మార్చి 1 నుంచి కఠినంగా అమలు
- ఉల్లంఘిస్తే జరిమానాలు, కేసులు

సామర్లకోట, ఆంధ్రజ్యోతి:

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇకపై ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతామంటే కుదరదు. హెల్మెట్ తప్పనిసరి. ఆపై అన్నిరకాల ధృవపత్రాలు ఉండాలి. నిబంధనలు పాటించాలి. లేకుంటే భారీ జరిమానాలు చెల్లించక తప్పదు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం(హైకోర్టు) ఆదేశాల మేరకు మార్చి 1 నుంచి ప్రభుత్వం గట్టిగానే చర్యలకు దిగనుంది. మోటారు వాహన చట్టాలను మరింత కఠినంగా అమలు చేసేందుకు రవాణా, పోలీసు శాఖలు సిద్ధమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాల మోత మోగించనున్నారు. చట్టాన్ని పట్టించుకోకపోతే లైసెన్స్‌లనూ రద్దు చేసేందుకు వెనకాడరు. ఇందుకు సంబంధించి పోలీసుశాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ప్రతి వాహనదారుడి వివరాలు అందులో ఉంటాయి. గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినవారు, చలానా కట్టనివారి వివరాలు అన్నీ అందుబాటులోకి వస్తాయి. దానికి అనుగుణంగా జరిమానాలు విధిస్తారు. ఈ నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండి నిబంధనలు పాటించాలి.



ప్రజల్లో మార్పు కోసమే..

రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా వాహనదారులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. మార్చి 1 నుంచి వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. గ్రామీణ ప్రాంతాలనుంచి ఓవర్‌లోడ్‌తో ఆటోలు ఏడీబీ రోడ్డు, కెనాల్‌రోడ్డు, పెద్దాపురం, పిఠాపురం రోడ్డుమీదుగా సామర్లకోట పట్టణంలోకి వస్తున్నాయి. దీనివల్ల రోడ్డుప్రమాదాల్లో గాయ పడిన వారి సంఖ్య పెరుగుతుంది. దీన్ని నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇకపై నిబంధనలు కఠినంగా అమలుచేస్తాం. మూడుకంటే ఎక్కువసార్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారి లైసెన్స్‌లు రద్దుకు సిఫార్సు చేస్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తులకు నెల రోజులపాటు శిక్షలు పడే అవకాశం ఉంది.

-అడపా గరగారావు, ట్రాఫిక్ ఎస్ఐ, సామర్లకోట

ఇప్పటి వరకూ అలా.. 1 నుంచి ఇలా..

హెల్మెట్ లేకుండా ప్రయాణానికి ఇప్పటివరకూ రూ.135 జరిమానా వేసేవారు. ఇకనుంచి రూ.1000 కట్టాల్సిందే. లైసెన్స్ లేకుండా బండి నడిపితే రూ.10వేలు వసూలు చేస్తారు. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగితే కేసులు నమోదు చేస్తారు. 90 రోజుల్లో జరిమానా చెల్లించకపోతే వాహనాన్ని సీజ్ చేస్తారు. వెనుక కూర్చునవారు హెల్మెట్ ధరించకపోతే రూ.1000 జరిమానా, వాహనానికి ఇన్సూరెన్స్ లేకుంటే రూ.1000, రెండోసారి పట్టుబడితే రూ.2000, భారీ సైలెన్సర్లతో సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడితే రూ.2000, అదే రెండోసారి దొరికితే రూ.4000, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించుకుంటే మనిషికి రూ.200 చొప్పున జరిమానా విధిస్తారు. మైనర్లు డ్రైవ్ చేస్తే రూ.1000, నిషేధం ఉన్న ప్రాంతాలో పార్కింగ్ చేస్తే రూ.1000 నుంచి రూ.2000, బైక్ రేసుల్లో పాల్గొంటే రూ.5000, అందులో దొరికితే రూ.10వేలు, తాగి వాహనం నడిపితే మూడు నెలలు జైలుశిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధిస్తారు. దీన్ని అమలు చేసేందుకు పోలీసు, రవాణా శాఖలు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాయి.

కళాశాలల్లో ఫేర్‌వెల్ పార్టీలు నిషేధించండి

- ఏ కార్యక్రమమైనా సంప్రదాయబద్ధంగా ఉండాలి
- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో ఫంక్షన్లు, ఫేర్‌వెల్ పార్టీలు, డీజెలు వంటి నృత్య ప్రదర్శనలు నిషేధించాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆదేశించారు. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయంలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు శుక్రవారం నన్నయ వర్సిటీ నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆమెను కలిశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించేందుకే కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్నారు. కళాశాలలు ఆహ్లాదకర వాతావరణంలో ఉండాలన్నారు. రాష్ట్రంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలలు నన్నయ వర్సిటీలో ఉన్నాయన్నారు. 390 అనుబంధ కళాశాలల్లో లక్షకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. అన్ని కళాశాలల్లో పరీక్షలు సక్రమంగా జరిగేందుకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా మోనటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దాన్ని విశ్వవిద్యాలయం నుంచి అధికారులు పరిశీలిస్తారని చెప్పారు. దీనిద్వారా ఆయా కళాశాలల్లో పరీక్ష నిర్వహణ, పర్యవేక్షణ సులభతరం అవుతుందని అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలను సందర్శించేందుకు అయ్యే ఖర్చు, సమయం కలిసి వస్తాయన్నారు. వీటిని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆయాకళాశాలలపై ఉందన్నారు. దీనిపై కళాశాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.అర్హులైన అధ్యాపకులతో పూర్తిస్థాయిలో అన్నికళాశాలల్లో తరగతులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి పాల్గొన్నారు.



కళాశాలల యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

యువతిని వంచించిన వ్యక్తికి పదేళ్ల జైలు

ఐ.పోలవరం,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచించిన వ్యక్తికి కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధించింది. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019లో పశువుల్లంక సచివాలయంలో వాలంటీర్‌గా పనిచేస్తున్న యువతితో అక్కడే వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తాళ్లరేవు మండలం చిన్నగోవలంకకు చెందిన కాశి మధుబాబు ప్రేమ వ్యవహారం నడిపాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంచించాడు. బాధితురాలు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ సీహెచ్ రాజేష్ కేసు నమోదుచేయగా అప్పటి సీఐ జానకీరామ్ నిందితుడిని అరెస్టు చేశారు. వాదోపవాదనల తర్వాత నేరం రుజువుకావడంతో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం మహిళాకోర్టు జడ్జి బెన్నయ్యనాయుడు శుక్రవారం తీర్పుచెప్పినట్టు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



ఆటోడ్రైవర్ రామకృష్ణ ను సన్మానిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

- ప్రయాణికురాలు మర్చిపోయిన నగల బ్యాగ్ పోలీసులకు అందజేత
- సత్కరించిన పోలీసులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆటోలో వదిలివేసిన 10 కాసుల బంగారు నగలతో ఉన్న బ్యాగ్‌ను ఓ ఆటోడ్రైవర్ పోలీసులకు అప్పగించాడు. అతడి నిజాయితీకి ఫిదా అయిన కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అతడ్ని సన్మానించి సత్కరించారు.

కాకినాడ జిల్లా అన్నవరానికి చెందిన ఊరసుధ తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం కాకినాడలోని బంధువుల వివాహానికి హాజరై శుక్రవారం తిరిగి అన్నవరం వెళ్లేందుకుగాను సర్పవరంలో దిగి ఆటోలో నగలతో ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయింది. అనంతరం ఆటోలో బ్యాగ్ మరిచిపోయిన విషయాన్ని గ్రహించి సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆటోను పెదపూడిలో గుర్తించి అక్కడి ఎస్ఐకు సమాచారం అందించారు. పెదపూడి ఎస్ఐ తన సిబ్బందితో ఆటో గురించి వెతుకుతున్న తరుణంలో ఆటోడ్రైవర్ ఎర్రంశెట్టి రామకృష్ణ తమ ఆటోలో వదిలివేసిన బ్యాగ్‌ను గుర్తించి పెదపూడి ఎస్ఐ రామారావుకు అందజేశాడు. అనంతరం నగలతో ఉన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని సుధకు ఎస్పీ ద్వారా అందజేశారు. ఆమె పోలీసులకు, ఆటో డ్రైవర్ రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపింది.

ఇంటి బయటపెట్టిన బైక్ దగ్ధం



కాకినాడలో దగ్ధమవుతున్న మోటారుసైకిల్

- తెల్లవారు జామున తగులబెట్టిన అగంతకులు
- పాతకక్షల నేపథ్యంలో జరిగి ఉండొచ్చని అంచనా

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఇంటి బయటపెట్టిన మోటారుబైక్‌ను కొంతమంది అగంతకులు తగులపెట్టిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున కాకినాడలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ పాతబస్టాండ్ టీబీ ఆస్పత్రి వెనుక వీధిలో పెమ్మాడి అజయ్‌కుమార్ తన పల్సర్-150 మోటారుబైక్‌ను అతడి ఇంటి బయట పార్క్ చేసి నిద్రించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో అగంతకులు మోటారుబైక్‌ను ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టి తగులపెట్టారు. వాహన యజమాని, స్థానికులు గమనించేసరికి బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనకు కారణం 3 నెలల క్రితం స్థానికుడైన ధాలీ హత్యోదంతానికి ప్రతీకార చర్య అని స్థానికులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో గంజాయి సేవించిన ఆకతాయిలు తమను భయాందోళనలకు గురిచేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పంట బోదెలోకి దూసుకెళ్లి వ్యక్తి మృతి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్‌ను అతివేగంగా నడపడంతో పంటబోదెలోకి దూసుకుపోయి రాయిని ఢీకొట్టిన ఘటనలో బైక్ వెనుక కూర్చొన్న గొలకోటి రమేష్(45) అక్కడికక్కడే మృతిచెందినట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు శుక్రవారం తెలిపారు. కొత్తపేట మండలం కండ్రి గ్రామ శివారు ఆర్లపల్లివారిపాలేనికి చెందిన రమేష్ తాపీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. తన తోడల్లుడైన గునిశెట్టి సోమసుందరశేఖర్‌తో కలిసి మోటారుసైకిల్‌పై రాజోలు నుంచి అత్తవారి గ్రామమైన ఉప్పలగుప్తం బయలుదేరారు. మార్గమధ్యలో కామనగరువులోని రాజులపూడి భాస్కరరావు ఇంటి ప్రాంతానికి వచ్చేసరికి మోటారుసైకిల్ అదుపుతప్పి పంటబోదెలోకి దూసుకుపోయింది. రమేష్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మోటారుసైకిల్ నడుపుతున్న శేఖర్‌కు గాయాలు కావడంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శవమై తేలాడు

అదృశ్యమైన యువకుడి మృతదేహం గోదావరిలో లభ్యం



గగ్గులోతు సాయితేజ(ఫైల్)

కొవ్వూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గోదావరినదిలో దూకి గల్లంతైన యువకుడి మృతదేహన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. తూర్పుగోదావరిజిల్లా ఔరంగాబాద్ ఇసుకర్యాంపు సమీపంలో గురువారం రాత్రి మృతదేహన్ని బయటకు తీయించారు. ఈనెల 19న రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన గగ్గులోతుసాయితేజ(25)అదృశ్యమయ్యాడు. గోదావరిలో మృతదేహం లభ్యం కావడంతో సాయితేజది అని నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసును మార్పు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.

కొట్టేసిన చోటే కుదువ పెట్టి..

- కెనరా బ్యాంకులో ఘరానా మోసం
- గోల్డ్ అప్రైజర్ చేతివాటం
- ఖాతాదారుల ఆందోళన



కుదువ పెట్టిన బంగారం కోసం పడిగాపులు కాస్తున్న ఖాతాదారులు

తుని రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తేటగుంట కెనరా బ్యాంకులో బంగారం గోల్‌మాల్ సంచలనం రేకెత్తించింది. గోల్డ్ అప్రైజర్ చేతివాటంతో 150కి పైబడి ఖాతాదారుల బ్యాంకులో కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు మాయం కావడంతో ఖాతాదారులు కంగుతిన్నారు. దీంతో పెద్దఎత్తున ఖాతాదారులు బ్యాంకువద్ద ఆందోళనకు దిగగా బ్యాంకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి వారికి సర్ది చెప్పే పనిలోపడ్డారు. విచారణ చేపట్టిన అధికారులు ఇంటి దొంగల పనిగా తేల్చేశారు. అదే బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న మేనేజర్‌తోపాటు అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేశారు. అక్రమాల్లో సూత్రధారిగా ఉన్న గోల్డ్ అప్రైజర్‌పై తుని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఆశ్చర్యపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతమైన తేటగుంటలో ఏర్పాటు అయిన కెనరా బ్యాంకులో సగానికి మించి ఖాతాదారులు రైతు కుటుంబీకులే. ఇదే అదునుగా భావించి గోల్డ్ అప్రైజర్ ఏడాదికొకసారి గోల్డ్‌లోన్ రెన్యువల్ చేసే క్రమంలో సంబంధిత ఖాతాదారుడి గోల్డ్ ప్యాకెట్‌నుంచి ఒకటి రెండు బంగారు ఆభరణాలు కాజేసి అదే బ్యాంకులో తన కుటుంబసభ్యుల ఖాతాల పేరిట కుదువ పెట్టి కాసులు కొల్ల కొట్టినట్లు విచారణలో బయటపడింది. గోల్డ్ గోల్‌మాల్ జరిగిందన్న సమాచారంతో పెద్దఎత్తున బంగారం కుదువ పెట్టిన ఖాతాదారులు ఆందోళనకు దిగారు. వారి బంగారానికి బ్యాంకే గ్యారెంటీ అని అధికారులు చెప్తున్నా బ్యాంకు బయట వారంతా ఆందోళనకు దిగుతున్నారు.

పాఠశాలలో ఇన్‌ట్రాక్టివ్ ప్లాట్ ప్యానల్ చోరీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో ఎంపీపీయుపీ ఉన్నత పాఠశాలలో ఇన్‌ట్రాక్టివ్ ప్లాట్ ప్యానల్ చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలను శుక్రవారం తెరిచేసరికి ఐపీఎఫ్ చోరీకి గురయినట్లు గుర్తించారు. హెచ్ఎం బొలిశెట్టి లక్ష్మణరావు ద్రాక్షారామ పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించారు. రూ.లక్ష వరకు ఖరీదు చేసే ఐపీఎఫ్‌ను ఈనెల 10న చోరీ చేసేందుకు దొంగలు యత్నించారు. కటకటాల్లో ఇరుక్కుపోవడంతో వదిలిపోయారు. దీనిపై అప్పట్లో హెచ్ఎం ఫిర్యాదు చేశారు. దొంగలు మరోసారి ప్రయత్నించి చోరీ చేశారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు

కోటనందూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కె.కొట్టాంలో మురుగుడు కాలువవద్ద శుక్రవారం ఉపాధి పనుల వద్ద తేనెటీగలు దాడి చేయడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కూలీలు పనులు చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో పండుగ రాజు, పండుగ అప్పారావు, సలాది నాగరత్నం, కోనాల సింహాచలం, గుడాల గొంతెమ్మ, కడితి నిర్మలకుమారికి గాయాలయ్యాయి. వీరిని కోటనందూరు పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యంకోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాశీవిశ్వనాథం మృతి.. బ్యాడ్మింటన్‌కు తీరని లోటు



కాశీవిశ్వనాథం భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

- షటిల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్
- సాత్విక్ సాయిరాజ్‌కు పలువురి పరామర్శ

అమలాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీనియర్ వ్యాయామోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం మృతి రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్‌కు తీరని లోటని షటిల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. తానొక మంచి ఆత్మీయుడిని కోల్పోయానన్నారు. గుండెపోటుతో కాశీవిశ్వనాథం మృతిచెందడంతో ఎంతో బాధను కలిగించిందన్నారు. శుక్రవారం అమలాపురం గాంధీబజార్‌లోని కాశీ స్వగృహం వద్దకు అంతర్జాతీయ క్రీడాకారులతో కలిసి వచ్చి ఆయన భౌతిక కాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తన శిష్యుడైన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్‌ను ఆయన ఓదార్చారు. న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకమైన ధ్యానచంద్ ఖేల్‌రత్న అవార్డును అందుకోవాల్సిన సాత్విక్ తండ్రి కాశీ మృతి సమాచారంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని రాత్రికి అమలాపురం చేరుకున్నారు. గోపీచంద్‌తోపాటు సాత్విక్ జోడి అయిన చిరాగ్‌శెట్టి, మరో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, వెటరన్ క్రీడాకారుడు ఏవీఎస్ఎన్ మూర్తి, ఆకుల సునీల్, ఆకుల బాలాజీ తదితరులు కాశీ భౌతికకాయానికి నివాళులర్పించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాత్విక్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. సాత్విక్‌కు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులతోపాటు జవ్వాది తాతబాబు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, పాయసం శ్రీనివాస్ పాల్గొని నివాళులర్పించారు. జాతీయ బ్యాడ్మింటన్ రిఫరీ అయిన కాశీ మరణం క్రీడారంగానికి తీరని లోటని మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు అన్నారు. మరణ వార్త తెలిసిన వెంటనే ఫోన్‌లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాశీ తనకు మంచి మిత్రుడని, ఎంపీగా పనిచేసిన సమయంలో కాశీ ద్వారా క్రీడాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

మండపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన వ్యక్తి గతేడాది రెండు మోటారుసైకిళ్లను దొంగిలించిన కేసు రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష పడిందని మండపేట పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట పట్టణం రథంవీధికి చెందిన మేకాశివశ్యామ్ గతేడాది సెప్టెంబరు 24న రెండు బైక్‌లు చోరీ చేసినట్టు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఆలమూరు మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి నాగేశ్వరనాయక్ నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధించారని ఎస్ఐ శాస్త్రి తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

మండపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో పదో తరగతి బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో నిందితుడిని ఈనెల20న అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ దారం సురేష్ తెలిపారు. ఈనెల 17న బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదైందని ఆయన చెప్పారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి ముప్పిడి క్రాంతికుమార్‌ను గురువారం అరెస్టు చేసి ఆలమూరు కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులపాటు రిమాండ్ విధించారని తెలిపారు.

బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న బాలుడి అరెస్ట్

రూ.2.80లక్షల విలువైన ఆరు బైక్‌లు స్వాధీనం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో బైక్ చోరీలకు పాల్పడుతున్న బాలుడ్ని ఇంద్రపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రూ.2.80 లక్షలు విలువ చేసే ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో పలుప్రాంతాల్లో జరుగుతున్న చైన్‌స్నాచింగ్, చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకునే చర్యల్లోభాగంగా శుక్రవారం ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి చీడిగ ఫ్లైఓవర్ బ్రిడ్జివద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై నుంచి పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలుడు కాకినాడ వైపు వస్తోండగా బైక్ ఆపి తనిఖీ నిర్వహించారు. అనుమానంతో విచారించగా బైక్‌ల చోరీలకు పాల్పడిన విషయం బయటపడింది. ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్, సామర్లకోట పీఎస్‌లో మూడు బైక్‌లు, కోరింగ, సర్పవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు బైక్‌లు వెరసి ఆరు బైక్‌లను నిందితుడినుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు. వీటి విలువ రూ.2.80లక్షలు ఉంటుందన్నారు. నిందితుడుపై ఉన్న పలు కేసుల్లో చేసిన నేరాలకుగాను డిస్ట్రిక్ట్ ప్రొబిషనరీ ఆఫీసర్ ముందు హాజరు పరిచామన్నారు. నిందితుడ్ని పట్టుకుని చోరీసొత్తు రికవరీ చేసిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

'ఇంటర్ కళాశాలలుగా మార్చే ఆలోచన విరమించుకోవాలి'

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): +2పాఠశాలలను ఇంటర్ కళాశాలలుగా మార్పుచేసే ఆలోచనను విరమించుకోవాలని వాటిని బలోపేతం చేసేందుకు తగిన కార్యాచరణ చేయాలని కోరుతూ జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆర్జేడీ జి.నాగమణికి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు.



సివిల్ సర్వీసెస్ డైరీ ఆవిష్కరణ

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ సివిల్ సర్వీసెస్(ఎగ్జిక్యూటివ్ బెంచ్) అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన-2025 డైరీని కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావులతోకలిసి శుక్రవారం ఆవిష్కరించారు.

ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చేసి

పిఠాపురంలో నగదు అపహరణ

పిఠాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగదు మార్చుకునేందుకు వచ్చిన వ్యక్తిని ఏమార్చి ఏటీఎం కార్డు మార్చేసి ఒక అగంతకుడు నగదును డ్రా చేసి అపహరించాడు. గురువారం జరిగిన ఈ సంఘటన శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన మాకినీడి త్రిమూర్తులు నగదు డ్రా చేసుకునేందుకు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికి వచ్చాడు. ఏటీఎం నుంచి నగదు తీసుకునేందుకు గానూ అక్కడ ఉన్న వ్యక్తి సాయం కోరాడు. ఆ అగంతకుడు త్రిమూర్తులు కార్డు తీసుకుని ఏటీఎంలో పెట్టి పనిచేయడం లేదని చెప్పి మరో కార్డు ఇచ్చేశాడు. కొంత సమయం తర్వాత త్రిమూర్తులు మరలా ఏటీఎం వద్దకు వెళ్లి నగదు డ్రా చేసేందుకు రాగా పిన్ ఎర్రర్ చూపించింది. దీంతో అతను బ్యాంకు మేనేజరు వద్దకు వెళ్లి కార్డు చూపించగా, అది మీది కాదని త్రిమూర్తులుకు చెప్పారు. అదే సమయంలో బ్యాంకు ఖాతాను తనిఖీ చేసి చూడగా నాలుగు విడతలుగా రూ.26 వేలు డ్రా చేసినట్లు తెలిపారు. అవాక్కయిన త్రిమూర్తులు పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెల్‌ఫోన్ చోరీ

పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం వద్ద సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఆ ప్రాంతంలో రోడ్డుపై వెళుతున్న ఇద్దరు యువకులు పడిపోతున్నట్లు నటించారు. ఇదే సమయంలో ఆ మార్గంలో వెళుతున్న వ్యక్తి సాయం చేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లి చూసుకునేసరికి జేబులో ఉండాల్సిన సెల్‌ఫోన్ చోరీకి గురయినట్లు గుర్తించారు. ఈ దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీనిపై పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు అందింది.

రేపు మహాకుంభమేళాకు బస్సు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి ఫిబ్రవరి 23వ తేదీన ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు స్టార్ లైనర్ నాన్ ఏసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సుకు టిక్కెట్స్ కావాల్సిన భక్తులు ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. ఈ బస్సులు కాకినాడ నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుని అక్కడ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణంలో అయోధ్య, వారణాసి, క్షేత్రాలు చూపించి తిరిగి ఏడు రోజుల అనంతరం కాకినాడ చేరుతుందన్నారు. ఈ బస్సుకు టిఫిన్స్, భోజనాలతో సహా ఒక్కో టికెట్‌కు రూ.12,200గా నిర్ణయించినట్లు చెప్పారు. బుకింగ్ కోసం 7382910869, 7382910778 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మాతృభాష గొప్పతనం మరువరానిది

సామర్లకోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏ వ్యక్తి అయినా మాతృభాషలో పట్టు సాధించినప్పుడే మిగిలిన భాషలపై కూడా పట్టు సాధించే అవకాశం ఉంటుందని అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయురాలు బి. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం జరగ్గా తెలుగు భాష గొప్పతనాన్ని ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, జీ.బేబీరాణి విద్యార్థులకు వివరించారు.

పీఆర్‌లో వేడుకలు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అధ్యక్షతన తెలుగు హిందీ విభాగాల అధిపతి డాక్టర్ పి.హరిరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. సాహితీవేత్త కె.గౌరీనాయుడు, వై.బుజ్జి, ఆచార్యులు స్వరాజు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, నారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గృహాలు నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ సూచించారు.చిత్రాడలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సాయంత్రం పరిశీలించారు.

పేరాబత్తులకే ఓటేయండి



కాకినాడలో ఎమ్మెల్యే కొండబాబు ప్రచారం

కూటమి నాయకుల విస్తృత ప్రచారం



కరపలో మాజీ మంత్రి చిక్కాల ప్రచారం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కాంక్షించే పట్టభద్రులంతా పేరాబత్తులకు పట్టం కట్టాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా శుక్రవారం గాంధీనగర్ రెడ్‌క్రాస్ సొసైటీలో ఎన్నికల ప్రచారం నిర్వహించి పట్టభద్రుల ఓట్లు అభ్యర్థించారు.పట్టభద్రులు విజ్ఞతతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మైనార్టీ సెల్ అధ్య క్షుడు ఎంఏ తాజుద్దీన్ ఆధ్వర్యంలో సాంబమూర్తినగర్, రెవెన్యూ కాలనీ మసీద్ ఏరియాలలో ప్రచారం చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ.రామారావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గరాజు, డాక్టర్ ప్రసాద్, అప్పలరాజు, కె.శివకుమార్, కె.కామేశ్వరరావు, మల్లేశ్వరరావు, కిరణ్మయి, దుర్గాదేవి పాల్గొన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, ఎన్నికల పరిశీలకుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ కోరారు. పిఠాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ఇతర కళాశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేరాబత్తుల రాజశేఖర్ సతీమణి సత్యవాణి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రచారం చేశారు. పిఠాపురంలోని కోర్టుల వద్ద జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు న్యాయవాదులను కలిసి రాజశేఖర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం పట్టణంలో ప్రచారం నిర్వహించారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖర్‌కు అండగా నిలవాలని రాజశేఖర్ సతీమణి సత్యవాణి కోరారు. టీడీపీ నాయకులతో కలిసి గొల్లప్రోలు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో ఉద్యోగులను కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ దారపురెడ్డి జగదీష్ ప్రచారం చేశారు. ప్రచారంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరపలో..

కరప, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖరం ఘనవిజయం సాధించడం తథ్యమని మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ కాకినాడ జిల్లా ప్రధానకార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా తెలిపారు. కరప, సిరిపురం గ్రామాల్లో శుక్రవారం కూటమి నాయకులతో కలిసి వారు విస్తృతంగా ప్రచారం చేశారు. అధికారులు, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి కరపత్రాలను అందజేశారు.ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో గ్రాడ్యుయేట్‌లు అందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కూటమి నాయకులు దేవు వెంకన్న, బండారు మురళి, పోలిశెట్టి తాతీలు, చోడపునీటి వెంకటరమణ, పేకేటి దుర్గాప్రసాద్, జెల్లా శివ, కోన వెంకటలక్ష్మి, నున్న వీరబాబు, సిరిపురం కవి, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

కాకినాడ ఎంపీ ప్రచారం..

పిఠాపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పేరాబత్తుల రాజశేఖర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ కోరారు. పిఠాపురం పట్టణంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డాక్టర్ పంతం రాజేష్, డాక్టర్ పద్మశ్రీ ఇంటి వద్ద పటభద్రుల ఓటర్లతో సమావేశం నిర్వహించారు.



పిఠాపురంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ ప్రచారం



పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యేలు వర్మ, గోవిందు ప్రచారం

'త్వరలో రాజ్యసభ ఎంపీ కార్యాలయం వద్ద గ్రీవెన్స్‌సెల్'



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు త్వరలో రాజ్యసభ ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద గ్రీవెన్స్‌సెల్ ప్రారంభిస్తున్నట్లు టీడీపీ నాయకులు వెల్లడించారు. శుక్రవారం స్థానిక శాంతినగర్‌లోని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంవద్ద మీడియా సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆనంద్‌నూటన్, హరీష్, చలపతి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులంతాఅభివృ ద్ధి చూసి ఓటువేసి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి సహకరించాల న్నారు.

వందే భారత్‌కు సామర్లకోటవద్ద శాశ్వత హాల్ట్ కల్పించాలి

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ-సికింద్రాబాద్ మధ్య తిరిగే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సామర్లకోట వద్ద శాశ్వత హాల్ట్ కల్పించాలని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు దక్షిణ మధ్య రైల్వేఅధికారులకు రాసినలేఖలో కోరారు. ఈ రైలుకు సామర్లకోట వద్ద ప్రయోగాత్మకంగా ఇచ్చిన తాత్కాలిక హాల్ట్‌ను శాశ్వత హాల్ట్‌గా చేయాలన్నారు. దీనిపై దక్షిణ మధ్య రైల్వే జీఎం స్పందిస్తూ సామర్లకోటవద్ద శాశ్వత హాల్ట్ ఇచ్చేందుకు అవకాశాలు పరిశీలిస్తున్నామన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై అక్రమంగా తరలిస్తున్న పశువులను గొల్లప్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారి 16పై పశువుల అక్రమ రవాణా జరుగుతన్నదని అందిన సమాచారంతో గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున వాహన తనిఖీలు నిర్వహించారు. మినీవ్యాన్‌లో తరలిస్తున్న 8 ఎద్దులను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం జిల్లా దత్తారాజేరు మండలం పెదమనాపురానికి చెందిన డ్రైవర్ కర్నాటి విజయకుమార్, గుడ్ల రమణలపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

కన్నబాబును కలిసిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీమంత్రి దాడిశెట్టి రాజా శుక్రవారం కాకినాడ 2వ డివిజన్ వైద్యనగర్‌లో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, మాజీమంత్రి కురసాల కన్నబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీని బలోపేతం చేయడం, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని భవిష్యత్తులో అనుసరించాల్సిన పద్ధతులపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు పరస్పర అభినందనలు తెలుపుకున్నారు. జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల మహిళా విభాగం కోఆర్డినేటర్ జమ్మలమడక నాగమణి, మాజీ ఎంపీపీ గోపిశెట్టి పద్మజాబాబ్జి, పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ సత్యనారాయణ, లింగం రవి, రాందేవు చిన్న, కర్రి చక్రధర్, వెంకట్రాజు పాల్గొన్నారు.



జేఎన్టీయూకేలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

21వ శతాబ్దాన్ని కృత్రిమ మేధ శాసిస్తుంది : వీసీ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత 21వ శతాబ్దాన్ని కృత్రిమ మేధతో కూడిన ఆధునిక సాంకేతికత శాసిస్తుందని, అటువంటి సాంకేతికతపై పట్టు సాధించినప్పుడే మెరుగైన పరిపాలన చేపట్టేందుకు వీలు కలుగుతుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. వర్సిటీలోని సెంట్రలైజ్డ్ కంప్యూటర్ సెంటర్‌లో యూనివర్సిటీ, యూసీఈకే అధ్యాపకేతర సిబ్బందికి ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ఎంఎస్ ఆఫీస్‌పై రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఒక సంస్థ అభివృద్ధి చెందేందుకు అందరూ కలిసి సమర్థవంతంగా పనిచేసినపుడే ఆసంస్థకు మంచి పేరు వస్తుందన్నారు. ఎంఎస్ ఆఫీస్ టూల్స్‌లోని అడ్వాన్స్‌డు టెక్నిక్స్‌ను నేర్చుకుని తమ పనిని మరింత సులభతరం చేసుకోవాలన్నారు. డైరెక్టర్ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్ బీటీ కృష్ణ, కశ్యప్, రఘురామ్, వెంకట్, షాజహాన్, సాగర్ పాల్గొన్నారు.



చీడిగలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో రవికుమార్

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి : డీపీవో

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సూచించారు. రూరల్ మండలం చీడిగలోని చెత్త సంపద కేంద్రాన్ని, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును శుక్రవారం డీపీవో పరిశీలించారు. అనంతరం క్లాప్ మిత్రలకు నిర్వహించిన అవగాహనా సదస్సులో పాల్గొని పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వానపాములతో వర్మీ కంపోస్టును తయారుచేయాలన్నారు తడి, పొడి చెత్తను వేరుచేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి బి.గోవిందరాజు అధ్యక్షత వహించగా ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి పి.సతీష్, ఈవోపీఆర్డీ ఎంఎస్ ఆంజనేయులు, పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లోపు బీసీ కులగణన చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు ఎన్నికలలోపు బీసీ కులగణన చేపట్టాలని, జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించడమే తమ జెండా, అజెండా ఒకటేనని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. శుక్రవారం నాగమల్లితోట జంక్షన్ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక, బీసీ కుల సంఘాల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టకపోవడంతో చట్టసభలు, స్థానికసంస్థల్లో రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతోపాటు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్ కింద నిధులు మంజూరు చేయాలన్నారు. కులగణన జరిగితే చట్టసభలతోపాటు అన్ని రంగాల్లో బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధిస్తారన్నారు. బీసీ కులగణన చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో కాకినాడ జిల్లా నూతన అధ్యక్షుడుగా గుత్తుల రమణ, ప్రధాన కార్యదర్శి మన్నె నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు విశ్వనాథపల్లి శ్రీనివాస్‌రాజు, సిటీ అధ్యక్షుడుగా బడే వెంకటకృష్ణ, సిటీ ఉపాధ్యక్షులుగా దాసరి వీరబాబు, ప్రధాన కార్యదర్శి మల్లిపూడి శివాజీ, సిటీ కార్యదర్శి దారపు శిరీష, సహాయ కార్యదర్శి దాలిపర్తి కుమారస్వాములను సభ్యులు ఎన్నుకున్నారు. నూతన సభ్యులకు శంకరరావు నియామక పత్రాలు అందించారు.

పోలింగ్ మెటీరియల్ కేంద్రం వద్ద ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాకినాడ డివిజన్‌లో పోలింగ్ మెటీరియల్ పంపిణీకి సంబంధించి స్థానిక మెక్లారిన్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ మెటీరియల్ కేంద్రం వద్ద ఏర్పాట్లను శుక్రవారం కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ డివిజన్‌లో 67 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 14 రూట్లుగా విభజించి ఏర్పాట్లు చేశామన్నారు. మెటీరియల్ పంపిణీ కేంద్రంలో విద్యుత్, తాగునీరు, షామియానాలు, కుర్చీలు పోలింగ్ సిబ్బందికి భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. ఆర్డీవో వెంట అర్బన్ తహశీల్దార్ వి జితేంద్ర, సర్వేయర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

ఆదివారం గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షల నేపథ్యంలో కాకినాడలో నాలుగు పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలులో ఉంటుందని ఆర్డీవో తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



విద్యుత్ వెలుగుల్లో భీమేశ్వరాలయం

సామర్లకోట,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): సామర్లకోట భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 22నుంచి వైభవంగా ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. 22న శనివారం ఉదయం 10 గంట లకు స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులుగా అలంకరించనున్నట్లు తెలిపారు. 24న సోమవారం విఘ్నేశ్వరపూజ, అంకురారోపణ, దీక్షాధారణ, అనంతరం మధ్యాహ్నం స్వామివారి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఇత్తడి నంది వాహనంపై అలంకరించి గ్రామోత్సవం పురవీధులమీదుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామోత్సవం అనంతరం తిరిగి ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రాత్రి 9.05 నిమిషాలకు దివ్య కళ్యాణమహోత్సవం వైభోవంగా జరగనున్నట్లు తెలిపారు. 25న మంగళవారం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలుచేయనున్నట్టు తెలిపారు. 26న బుధవారం తెల్లవారుజామున ఒంటి గంటనుంచి మహాశివరాత్రి పర్వదినం పురస్క రించుకుని స్వామివారి మూలవిరాట్‌వద్ద అభిషేకాలు నిర్వహించనున్నామన్నారు. సాయంత్రం పండిత సదస్యం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ కాలపూజలలో దేశంలోని 12ప్రధాన పవిత్ర నదుల నుంచి 12ప్రత్యేకపాత్రల్లో సేకరించిన జలాలతో పిఠాపురం రాజావారి గోత్రనామాలతో అభిషేకాలు జరపనున్నట్లు తెలిపారు. 27న గురువారం బాలాత్రిపుర సుందరి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహిస్తామన్నారు.

ముగిసిన 'ఆదిత్య' ఉత్సవ్ 2కే12



జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో రవీంద్రనాథ్

కాకినాడరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులే దేశ ప్రగతికి సోపానాలని జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కాకినాడ శ్రీనగర్ ఆదిత్య పాఠశాల 41ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవ్ 2కే12 పేరుతో నిర్వహిస్తున్న వార్షిక వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఆదిత్య చైర్మన్ శేషారెడ్డి, వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి, డైరెక్టర్ శృతి, ప్రిన్సిపాల్ రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా డీఎఫ్‌వో, గౌరవ అతిథిగా రచయిత వి.శ్రీకాంత్‌నాయుడు పాల్గొని జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా సిరిపురం గ్రామదేవతల తీర్థం



గ్రామదేవతను దర్శించుకుంటున్న దొరబాబు

సిరిపురం(కరప), ఫిబ్రవరి 21: సిరిపురం గ్రామదేవతలు గోగులమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు చిక్కాల దొరబాబు, చిక్కాల సుబ్బారావు నేతృత్వంలో గురువారంరాత్రి జాతర కన్నులపండువగా జరిగింది. శుక్రవారం ఉదయంనుంచి వేలాదిమంది భక్తులు సర్వాలంకరణ భూషితమైన అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, సర్పంచ్ నున్న సుజాత వీరబాబు, మాజీ సర్పంచ్ పల్లా వెంకన్న, న్యాయవాది చిక్కాల అబ్బు, చిక్కాల ఆదినారాయణ అమ్మవార్లను దర్శించుకున్నారు.

గడువు ముంచుకొస్తున్నా ప్రత్యేక ఏర్పాట్లు ఏవీ?

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు గడువు ముంచుకొస్తున్నా అధికారులు తగిన ఏర్పాట్లు చేయకపోవడంపై గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రైతు భరోసా కేంద్రం సిబ్బందిపైనే భారం మోపడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి రైతు వివరాలు నమోదు చేసేందుకు మూడు సార్లు ఓటీపీ వస్తోందని, బయోమెట్రిక్‌లు సరిగా పనిచేయడం లేదని, సర్వర్లు స్లోగా ఉంటున్నాయని వారు చెప్పారు.

నేరాల అదుపునకు కృషి చేస్తా: ట్రైనీ ఏఎస్పీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాల బారిన యువత పడకుండా చర్యలు తీసుకుంటానని, నేరాల అదుపునకు కృషి చేస్తానని,అరెస్టలపై కాదని ఐపీఎస్, ట్రైనీ ఏఎస్పీ ఆర్ సుస్మిత అన్నారు. శుక్రవారం తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సొంత రాష్ట్రం తమిళనాడు అని, ఏపీ కేడర్ ఐపీఎస్‌గా నియమితులై జనవరి 26న ట్రైనీ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించానన్నారు. కాకినాడ అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసి ప్రస్తుతం మూడునెలలపాటు ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తానన్నారు. హైస్కూళ్లలో బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సైబర్ క్రైంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో కురిసిన వర్షం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో వర్షం కురవడంతో చెట్ల కొమ్మలు, రోడ్డువెంబడి ఫ్లెక్సీలు నేలకూలాయి. మామిడి పూత, పిందె రాలిపోవడంతో ఎంతో నష్టం చేకూర్చిందని రైతులు ఆందోళనకు గురయ్యారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

చింతూరు డివిజన్‌లో

ఆర్ అండ్ ఆర్ గ్రామసభలు

చింతూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్‌లో మార్చి 1 నుంచి 3 వరకు పోలవరం ఆర్ అండ్ ఆర్ గ్రామ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు అధికారిక నోట్ శుక్రవారం విడుదలైంది. +41.5 కాంటూరు లెవెల్లో చింతూరు డివిజన్ పరిధిలో ముంపునకు గురికానున్న 52గ్రామాల్లో ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించారు. కొంతకాలం క్రితం చేపట్టిన లేడార్ సర్వే ఆధారంగా పోలవరం బ్యాక్ వాటర్ ముంపు మరింత పెరగనున్నట్లు స్పష్టమైంది. ఈ క్రమంలో +41.5 కాంటూరు స్థాయి ముంపులో అదనంగా మరో 31 గ్రామాలు ముంపునకు గురికానున్నట్లు వెల్లడైంది. తాజా ముంపు గణాంకాల్లో చింతూరు మండలంలో చింతూరు, ఉలుమూరు, మార్కండేయపేట, చూటూరు, ఏజీ కోడేరు, మల్లెతోట ఉన్నాయి. వరరామచంద్రపురం మండలంలో కన్నాయిగూడెం, అడవి వెంకన్న గూడెం, రాజుపేట, రాజుపేట కాలనీ, వడ్డిగూడెం, ధర్మతాళ్ళగూడెం, వరరామచంద్రపురం, చొప్పల్లి, కొంపల్లి, రామవరపుపాడు, శబ్రరాయి గూడెం, పత్తిపాక, గుండుగూడెం, చింతరేగుపల్లి, సోములగూడెం, చొప్పల్లి-2, ఉండగా, కూనవరం మండలంలో లేళ్లవాయి, కూళ్ళపాడు, టేకుబాక, పెదార్కూర్, పంద్రాజు పల్లి, శబరి కొత్తగూడెం, కొండ్రాజుపేట గ్రామా లున్నాయి. ఇప్పటికే ఈ గ్రామాల్లో ఇళ్ళ నష్టపరిహారం చెల్లింపు నేపథ్యంలో సామాజిక ఆర్థిక సర్వే పూర్తి చేశారు. మార్చి 1 నుంచి 3వరకు నిర్వహించనున్న గ్రామ సభల్లో అభ్యంతరాలు, చేర్పులు, ఇతరత్రా మార్పులతో పాటు భూమికి భూమి కేటాయింపు, కాలనీల కేటాయింపు గ్రామాల నిర్ధారణ చేయనున్నారు. ఆమేరకు నిర్వాసితుల నుంచి అంగీకారం పొందే ప్రక్రియ జరుగనుంది.

1, 3 తేదీల్లో పోలవరం గ్రామసభలు

కూనవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న గ్రామసభలు మార్చి 1, 3తేదీల్లో అధికారులు సభలు నిర్వహించనున్నారు. మండలంలోని మొదటి ప్రాధాన్యత కలిగిన తొమ్మిది ముంపు గ్రామాల్లో ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మండలంలో వాల్ఫర్‌పేట, కూనవరం, టేకులబోరు, కూళ్లపాడు, పెద ఆర్కూర్, పంద్రాజుపల్లి, శబరికొత్తగూడెం, కోండ్రాజుపేట తదితర గ్రామాల్లో సభలు నిర్వహిస్తారు.

కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషదేవి



ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

రంపచోడవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే వంతల మిరియాల శిరీష దేవి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం, లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అడబాల బా పిరాజు, పండా చెల్లన్నదొర(బాబి), చోటు, పాపోలు శ్రీనివాసరావు, ఇబ్రహీం, గణపతి, నాగు, రవి, పెంటమ్మ, రమణ వీర బాబు పాల్గొన్నారు.

పేరాబత్తులకు ఓటు వేయండి

చింతూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విలీన మండలాల ప్రజల సమస్యల పరిష్కారంకోసం పేరాబత్తుల రాజశేఖర్‌ని గెలిపించాలని కూటమి నాయకులు కోరారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చింతూరులో ప్రచారం సాగింది. ప్రచారంలో ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి పరిశీలకుడు దాడి రత్నాకర్ పట్టభద్రులను కలుసుకొని మొదటి ప్రాధాన్యతా ఓటు పేరా బత్తులకే వేయాలని అభ్యర్థించారు. డీఎస్సీ లాంటి పలు ఉద్యోగ ప్రకటనల ద్వారా ఉద్యోగాలు పొందే అవకాశం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గం పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మండల ఇన్‌చార్జి ఇల్లచిన్నారెడ్డి, ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్, బూత్ ఇంచార్జి శీలం తమ్మయ్య, నాయకులు ఎస్‌ఏ ఆసిఫ్, శ్యామల వినోద్, జనసేన మండల అధ్యక్షుడు మడవి రాజు, రవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు మిరియాల కొండబాబు క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారు చిత్రకారులకు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో మెరిట్ అవార్డు పొందారు. ఈసందర్భంగా ఆయన్ను శుక్రవారం ప్రధానోపాధ్యాయులు డీవీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పీఎంసీ చైర్మన్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. కొండబాబు జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో మెరిట్ అవార్డు పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ ఎం. మహబూబ్‌అలీ, పాపాని వీరభద్రరావు, ఉపాధ్యాయులు చప్పా సత్యనారాయణమూర్తి, సీహెచ్ శివకృష్ణ, పోసిబాబు, సత్యనారాయణ, రాట వెంకటరమణ, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి 3,4,5 తరగతుల విలీనం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో విద్యా విధానాలను మరింత అభివృద్ధి చేసేందుకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను సమీప ఆశ్రమ పాఠశాలలో విలీనం చేస్తున్నట్లు ఎంఈవో కారం వీరవెంకట సత్యనారాయణదొర తెలిపారు. స్థానిక రాజవొమ్మంగి ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంపీడీవో యాదగిరీశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతుల విద్యార్థులు పది కంటే తక్కువ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

కన్నబాబును కలిసిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన మాజీ మంత్రి దాడిశెట్టి రాజా శుక్రవారం కాకినాడ 2వ డివిజన్ వైద్యనగర్‌లో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీని బలోపేతం చేయడం, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని భవిష్యత్తులో అనుసరించాల్సిన పద్ధతులపై చర్చించుకున్నారు.ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన కన్నబాబును జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన దాడిశెట్టి రాజాలు ఒకరికొకరు పరస్పర అభినందనలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల మహిళా విభాగం కోఆర్డినేటర్ జమ్మలమడక నాగమణి, మాజీ ఎంపీపీ గోపిశెట్టి పద్మజాబాబ్జి, పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ సత్యనారాయణ, లింగం రవి, రాందేవు చిన్న, కర్రి చక్రధర్, వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులకు మద్దతుగా ప్రచారం



రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్యే అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఆయన మొదటి ప్రాధాన్య ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులైన టీచర్లను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ముఖ్యనాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగ్గంపేట శ్రీచైతన్య పబ్లిక్ స్కూల్, భాష్యం పబ్లిక్ స్కూల్, శ్రీప్రజ్ఞ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్, అక్షర జూనియర్ కళాశాలలు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో పెన్షనర్లను మొదటి ప్రాధాన్య ఓటు పేరాబత్తులకు వేయాలని కోరారు.

పేరాబత్తులను గెలిపించండి

గండేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. గండేపల్లి మండలంలోని ప్రగతి, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎమ్మెల్యే నెహ్రూ, నియోజకవర్గ పరిశీలకులు నీలం వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిత్య సతీష్‌రెడ్డి, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కుంచే రాజా, మారిశెట్టి భద్రం, పోసిన బాబురావు, పాలకుర్తి ఆదినారాయణ, జాస్తి వసంత్, బొల్లంరెడ్డి రామకృష్ణ, సుంకవల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒమ్మంగిలో కూటమి నేతల ప్రచారం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగిలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని ఒమ్మంగి భారతి విద్యానికేతన్ విద్యాసంస్థల్లో కూటమి నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు, ప్రత్యేక పరిశీలకుడు గంట నూకరాజు ఈ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, మంతెన వెంకటరమణ, గౌంతిన సురేష్, పల్లా గోపి, దాకారపు కృష్ణ, రామిశెట్టి మురళి, సీతారాం, జువ్విన తిరుపతిరావు, భవానివీరబాబు పాల్గొన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా చండీహోమం

అన్నవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ సప్తసతి పారాయణాలు, మూలమంత్రజపాలు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

జగ్గంపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సామర్లకోట నుంచి గోకవరం వెళ్లే రోడ్డులో కాపుకల్యాణమండపం, క్రిస్టియన్ కమ్యూనిటీహాల్, ఇండోర్ స్టేడియం, మోడల్ డిగ్రీ కాలేజ్, శ్రామికనగర్ కనెక్టివిటీ రోడ్లు సిమెంటు రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. డీఈ ఉమాశంకర్, జేఈ నారాయణ మూర్తిలతో కలిసి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శుక్రవారం పనులను పరిశీలించారు. రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టడంతో ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, పాండ్రంగి రాబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, బస్వా చినబాబు పాల్గొన్నారు.

పొలం రికార్డుల పరిశీలన

గండేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గండేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని డిప్యూటీ కలెక్టర్ రత్నమణి సందర్శించి పలు రికార్డులు తనిఖీ చేశారు. మండలంలో మురారి గ్రామానికి చెందిన ఓవ్యక్తి పొలం ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని దరఖాస్తు చేసుకోవడంతో విచారణ నిమిత్తం శుక్రవారం ఆమె వచ్చారని తహసీల్దార్ తెలిపారు. దరఖాస్తుకు సంబంధించిన మురారిలో భూమిని పరిశీలించి దానికి సంబంధించిన రికార్డులు కాపీలు పరిశీలించారన్నారు.ఆమెవెంట తహసీల్దార్ శ్రీనివాస్, సూరిబాబు,వీఆర్వో సుబ్బారావు ఉన్నారు.

ఫారంపాండ్ నిర్వహణపై అవగాహన

గండేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఫారంపాండ్ నిర్వహణపై రైతులకు ఎంపీడీవో నాతి బుజ్జి కె.గోపాలపురంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిగ్రామంలో 25 ఫారంపాండ్‌లు నిర్వహణకు ప్రతిపాదనలు ఉన్నాయని, రూ.300 వేతనం వచ్చేలా పనులు చేయాలని అన్నారు. టార్గెట్ ప్రకారం ప్రతి కూలీకి వంద రోజులు పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీవో గంగాభవానీ, ఈసీ రమేష్, టీఏలు మోహన్, శ్రీను, అబ్బులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

గండేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో గ్రంథాలయంలో మాతృభాషా దినోత్సవం జరిపారు.వివిధపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

జగ్గంపేట వైసీపీ వాణిజ్య అధ్యక్షుడిగా కరుటూరి

జగ్గంపేట,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గ వైసీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కరుటూరి వీర్రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం, తోట రాంజీలకు కృతజ్ఞతలు తెలిపారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు



శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయం

కిర్లంపూడి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న శివరాత్రి మహోత్సవాలకుమండలంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. చలువ పందిళ్లతో మామిడాకు తోరణాలతో విద్యుద్దీపాలంకరణ మధ్య ఆలయాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని భూపాలపట్నంలోని శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి ఆలయ ధర్మకర్తలు భూ పాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఆధ్వర్యంలో భక్తుల రాకకోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 23 నుంచి స్వామివారి కల్యాణోత్సవం ఆరు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు వీరంరెడ్డి బ్రదర్స్ తెలిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం లక్ష బిల్వార్చన, 23న అంకుర్పాన, కోలాట భజన, త్రిశూలస్నానం నాటిక, పుష్పయాగం నిర్వహిస్తారన్నారు.

విద్యుదాఘాతంతో మూడు పూరిల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైన మూడు పూరిల్లు

తునిరూరల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు వారివి, కూలికోసం బయటకి వెళ్లగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు కుటుంబాల ఇళ్లు బుగ్గిపాలయ్యాయి. తుని మండలం లోవ కొత్తూరులో విద్యుదాఘాతం సంభవించి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కాకాడ నాగలక్ష్మి, పెద్దాడ నూకరాజు, బత్తిన శ్రీరామమూర్తిలకు చెందిన మూడు పూరిల్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే మూడు గృహాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కాకాడ నాగలక్ష్మికి ఇటీవల భర్త చనిపోగా బంగారం కుదవ పెట్టి రూ.2లక్షలు ఇంట్లో పెట్టుకున్నట్లు వాపోతోంది. తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మహిళా భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



రామేశ్వరం పేటలో హాస్టళ్లలో నివసించే మహిళా విద్యార్థులకు సూచనలు ఇస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

గండేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలనిపెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు అన్నారు. ఎస్పీ ఆదేశాలతో ఆయన మండలంలోని సూరంపాలెం పంచాయతీ పరిధిలోని రామేశ్వరం పేటలో ఉన్న వివిధ కళాశాలలో చదువుతూ హాస్టల్స్‌లో నివసిస్తున్న విద్యార్థుల భద్రత దృష్ట్యా పలు సూచనలు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతపైప్రత్యేక శ్రద్ధ వహించాలని హాస్టల్ యజమానులకు సూచించారు. సీసీకెమెరాలు ఏర్పాటు చేరూలన్నారు. భద్రతా పరంగా ఎటువంటి సమస్య ఉన్నా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఆయనతోపాటు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు ఉన్నారు.

వేణుగోపాలస్వామి హుండీ లెక్కింపు

కిర్లంపూడి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గెద్దనాపల్లిలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నవరం దేవస్థానం అధికారులు శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం ఈవో ఆధ్వర్యంలో ఏఈవో ఎల్.శ్రీనివాస్, కాకినాడ ఎండోమెంట్ డీసీ ఆఫీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కంచి మూర్తి, యనమల అప్పారావు, వెలగ రమేష్ సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. హుండీలో రూ.1,22,700 నగదు, బంగారు 2.300గ్రాములు, వెండి 210 గ్రాములు ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు.

నేడు ధర్మవరంలో ఎమ్మార్పీఎస్ సమావేశం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం జరగనుంది. ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద జరిగే ఈ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు మోర్త సత్తిబాబు, అడ్డాల బాపూజీ, జెడ్డా అబ్బు, బురా చినబాబు, కాపారపు నూకరాజు తెలిపారు.

'ఆదిత్య'లో టెక్ కాన్ఫరెన్స్ 2కే25

గండేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్యలో గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆన్ క్యాంపస్, ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో టెక్ కాన్ఫరెన్స్ 2కే25 ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. మొదటిరోజు కాన్ఫరెన్స్‌లో భాగంగా ప్రధానవక్తగా సీనియర్ క్లౌడ్ అండ్ డెవ్‌లప్స్ ఇంజనీర్ గీతికా యర్రంశెట్టి మొదటి సెషన్‌ను నిర్వహించారు. ఆమె క్లౌడ్ కంప్యూటింగ్, డెవ్‌ఓప్స్‌ప్రాక్టీసెస్, పరిశ్రమలో వీటి వాడుక, కెరీర్ అవకాశాల గురించి విశదీకరించారు. ఆ తర్వాత ఐబీఎంఏఐ ఇంజనీరింగ్ మేనేజర్ ప్రియా రామన్ తన ప్రసంగంలో ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ రంగంలో తాజా అభివృద్ధి, పరిశ్రమలో ఏఐ భవిష్యత్ గురించి వివరించారు. డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

వందే భారత్‌కు సామర్లకోట వద్ద శాశ్వత హాల్ట్ కల్పించాలి

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ-సికింద్రాబాద్ మధ్య తిరిగే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సామర్లకోట వద్ద శాశ్వత హాల్ట్ కల్పించాలని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు రాసిన లేఖలో కోరారు ప్రస్తుతం ఈరైలుకు సామర్లకోట వద్ద ప్రయోగాత్మకంగా ఇచ్చిన తాత్కాలిక హాల్ట్‌ను శాశ్వత హాల్ట్‌గా చేయాలన్నారు.

హైవేపై మందుబాబు వీరంగం

కిర్లంపూడి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి జాతీయ రహదారిపై మందుబాబు వీరంగం సృష్టించాడు. ఫూటుగా తాగి జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలు ఆపివేసి గందరగోళం చేశాడు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులపై దాడి చేయడంతో మందుబాబుకు దేహశుద్ధి చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని అతడ్ని పోలీస్‌స్టేషన్‌కి తరలించి ట్రాఫిక్ నియంత్రించారు.

'ప్రత్తిపాడు హైవే జంక్షన్ వద్ద విద్యుత్ లైట్లు ఏరాటు చేయాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు హైవేపై సంతోషిమాత ఆలయ జంక్షన్‌వద్ద హైవేపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను కోరారు. ఈ జంక్షన్ వద్ద మొక్కుబడిగా రెండు సోలార్ లైట్లతో వాహనాల రాకపోకలు తెలియడం లేదని, దీనివల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతునానయని తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు శుక్రవారం ఆయన విన్నవించారు.

'అక్షరాస్యత పెంపుదలకు చర్యలు'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్షరాస్యత పెంపుదలకు చర్యలు చేపట్టినట్లు వయోజన విద్యనోడల్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లిలోని ఉల్లాస్ వయోజన విద్య శిక్షణా కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యత నిర్మూలనలో భాగంగా అక్షరాస్యతను పెంచే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. వెలుగు ఏపీఎం వెంకట్, సీసీ శ్రీనివాస్, ఎంఎస్‌ఏ నాగేశ్వరరావు, వీఓఏలు సత్యప్రియ, లక్ష్మి, వరలక్ష్మి, గనిలక్ష్మి పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన పలువురు బాధితులను నియోజకవర్గ వైసీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు శుక్రవారం పరామర్శించి చేయూతనందించారు. అనంతరం వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ మంత్రి కురసాలకన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమాల్లో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, దొరబాబు పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండుగ

కోటనందూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ మల్లవరంలో అడవి రాజులబాబు పండుగ వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి ముందు ఈ పండుగను ఏటా నిర్వహిస్తారు. గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో భారీ బాణసంచాతో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రెండు కిలోమీటర్ల మేర మండుటెండల్లో నడిచి లవకుశలను ఆరాధించే అడవిరాజులబాబుకు పూజలు చేశారు. 2వేలమందిపైగా తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురి ఎంపిక

కోటనందూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కోటనందూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ తెలిపారు. 8వ తరగతికి చెందిన కీర్తి వర్షిణి, అరిటాకుల ఉదయభాను, వంజారి కార్తీక్‌కు ఎంపిక య్యారు. వీరిని ఎంఈవోలు శ్రీనివాస్‌రావు, రామ్‌శేఖర్, సీఆర్పీ యర్రశేఖర్ అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై అక్రమంగా తరలిస్తున్న పశువులను గొల్లప్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారి 16పై పశువుల అక్రమ రవాణా జరుగుతన్నదని అందిన సమాచారంతో గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున వాహన తనిఖీలు నిర్వహించారు. మినీవ్యాన్‌లో తరలిస్తున్న ఎనిమిది ఎద్దులను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం జిల్లా దత్తారాజేరు మండలం పెదమనాపురానికి చెందిన డ్రైవర్ కర్నాటి విజయకుమార్, గుడ్ల రమణలపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు.